RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -132 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 17 జూన్ 2026

## జులై మూడో వారంలో తల్లికి వందనం..



**విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష**

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలని మంత్రి లోకేష్ ఆదేశం**

**జూన్ 29న షైనింగ్ స్టార్స్, జులైలో మెగా పీటీఎం నిర్వహణకు నిర్ణయం**

**వివిధ 'సెట్'లను సకాలంలో నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖకు సూచన**

**ఏపీకి ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్ మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

**అమరావతి,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

రాష్ట్ర విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి, విద్యార్థులకు నాణ్యమైన భవిష్యత్తును అందించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న**మిగతా 2లో...**

# సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్

## లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం



**అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం**

**పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం**

**సింగపూర్‌తో ఎపికి మంచి సంబంధాలు**

**మూడు దశాబ్దాలుగా కలసి పసనిచేస్తున్నాం**

**పార్ట్‌నర్‌షిప్ సన్నాహక సమ్మిట్‌లో చంద్రబాబు**


**అమరావతి,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో**మిగతా 2లో...**




## టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

### నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం




**న్యూఢిల్లీజూన్ 16ఆంధ్ర ప్రగతి**

నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్**మిగతా 2లో...**



## ఎపికి చేయూత

### వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**విజయవాడ,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయీ పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు**మిగతా 2లో...**

# ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..

## మోదీ, ట్రంప్‌కరచాలనం

**హర్మ్యూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్**

**రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి**

**న్యూఢిల్లీ,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం.**మిగతా 2లో...**



# క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

**- స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల నిర్వహణకు సహకరించండి**

**- కేంద్ర జల్ శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ ని కలసిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**-గోదావరి కాలుష్య నివారణ, సవాళ్లపై చర్చ**

**న్యూఢిల్లీ,జూన్ 16ఆంధ్ర ప్రగతి**



నమామి గంగే ప్రాజెక్టు తరహాలో క్లీన్ గోదావరి నది ప్రాజెక్టుని చేపట్టి గోదావరి నది ప్రాశస్త్యాన్ని కాపాడేలా కేంద్ర తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ ని కోరారు. వచ్చే ఏడాది జరగబోయే గోదావరి పుష్కరాలను స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాలు థీమ్ తో చేపడుతున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా గోదావరిని స్వచ్ఛంగా మార్చేందుకు కేంద్రం అందించే సహకారం చాలా అవసరం అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం కేంద్ర జల్ శక్తి మంత్రివర్యులు శ్రీ సి.ఆర్ పాటిల్ గారితో శ్రీ పవన్ కళ్యాణ్ గారు సమావేశం అయ్యారు. అనంతరం మీడియాతో శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "గోదావరి పుష్కరాలకు దేశం నలుమూలల**మిగతా 2లో...**

## మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా

**గుడివాడ అమర్నాథ్ తీరుపై మండిపడ్డ లోకేశ్**

**రెండేళ్ల విజయాలపై 25 నుంచి ఇంటింటికీ తెలుగుదేశం**

**అమరావతి,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనితపై అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ నేతల అసలు స్వరూపాన్ని **మిగతా 2లో...**




## వ్యవసాయంలో ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి

### వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన

**సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి**


**రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి**

**సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి**

**వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం**

**హైదరాబాద్,జూన్ 16ఆంధ్ర ప్రగతి**

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు**మిగతా 2లో...**



## మెట్రోపై రగడ..

**ఐఆర్‌ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి**

**తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది**

**మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య**

**అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి**

**తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి**

**దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు**



**2లో.**

## టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు

**మొదటిపేజీ తరువాయి**

యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.అలాగే, టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

## ఎపికి చేయూత

**మొదటిపేజీ తరువాయి**

మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. 2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు..

**మొదటిపేజీ తరువాయి**




ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## మహిళా ప్రజాప్రతినిధిపై ఇంత అక్కసా

**మొదటిపేజీ తరువాయి**

బయటపెట్టాయని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో పాలన, అభివృద్ధి, శాంతిభద్రతలపై సమాధానాలు లేక వైసీపీ నేతలు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆగ్రహించారు. మహిళా నేత, దళిత ప్రజాప్రతినిధిని లక్ష్యంగా చేసుకోవడం వైసీపీ నీచ రాజకీయ సంస్కృతికి నిదర్శనమని లోకేశ్ మండిపడ్డారు. అనిత రాజకీయ ప్రస్థానం, కష్టపడి ఎదిగిన మహిళా వ్యక్తిత్వానికి నిదర్శనమని లోకేశ్ ప్రశంసించారు. అనితకు, మహిళలకు, దళిత సమాజానికి వైసీపీ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి లోకేశ్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటలే లోకేశ్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర, జాతీయ కార్యవర్గంతో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి పాలన రెండేళ్ల విజయాలపై ఈ నెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ నేతలు వెళ్లాలని పిలుపునిచ్చారు. మొత్తం 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. సుమారు రెండు గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటికీ వెళ్లాలని యువనేత దిశానిర్దేశర చేశారు. తమ ఇబ్బందులను కొంతమంది ఎమ్మెల్యేలు లోకేశ్‌కి వివరించారు. అర్హులైన వారు కొత్త పెన్షన్లు అడుగు తున్నారని తెలిపారు. గ్రామానికి వెళ్లిన వెంటనే చిన్న చిన్న పనులు అడుగుతున్నారని, దీనికి కొంత నిధులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్య తనకు కూడా ఉందని.. ఏపీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకోవాలని ఎమ్మెల్యేలకు లోకేశ్ సూచించారు. అన్ని విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 45 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించాలని యువనేత మార్గనిర్దేశం చేశారు. వారానికి కనీసం నాలుగు రోజులైనా ఈ కార్యక్రమం నిర్వహించాలని లోకేశ్ ఆదేశించారు.

## వ్యవసాయంలో ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి

**మొదటిపేజీ తరువాయి**

సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశిరచారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

------

# సింగపూర్ సమ్మిట్‌లో అమరావతి బ్రాండింగ్..

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్స్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుందనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావించారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్టనర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్శిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్శిటీలు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# క్లీన్ గోదావరిని ప్రక్షాళన చేయండి

**మొదటిపేజీ తరువాయి**

నుంచి కోట్లాది మంది వస్తారు. వారికి గోదావరినది గొప్పతనం తెలిపేలా, నదిని అత్యంత శుభ్రంగా ఉంచాలన్నది కూటమి ప్రభుత్వ ఆలోచన. అయితే గోదావరి నది కాలుష్యం, శుద్ధి చేయని నీరు ప్రత్యక్షంగా నదిలో కలవడం వంటి సవాళ్లు ముడిపడి ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు కేంద్రం తగిన విధంగా సహకారం అందించాలి. మున్సిపాలిటీల్లో నీటి శుద్ధి కేంద్రాలను మరిన్ని నిర్మించి మురుగు నీటిని గోదావరిలో కలవకుండా నివారించాల్సిన అవసరం ఉంది. దీనిపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చించాం. ఎక్కడి నుంచి కాలుష్యం అధికంగా ఉంది.. నివారణ చర్యలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను చర్చించాం. ఘన, ద్రవ వ్యర్థాలు గోదావరిలో ప్రత్యక్షంగా కలవకుండా ఎలా నివారించాలి అన్న అంశాలను మంత్రివర్యుల దృష్టికి తీసుకువెళ్లాం. పుష్కరాలకు ముందే గోదావరి కాలుష్యాన్ని నివారించే చర్యలు తీసుకుంటాం. దీనికి కేంద్రం కూడా తగిన విధంగా సహకరిస్తుంది కేంద్ర మంత్రివర్యులు హామీ ఇచ్చారు. పుష్కరాలను కాలుష్య రహితంగా ఎలా నిర్వహించవచ్చు అన్న అంశాలతో మంత్రి గారికి నివేదిక రూపంలో అందించాం. కేంద్ర మంత్రి ఆ నివేదికను పరిశీలించి కూటమి ప్రభుత్వ విజన్ ను అభినందించారు. పుష్కరాల నిమిత్తం మోడల్ పంచాయతీల అభివృద్ధి, భక్తుల రద్దీ నియంత్రణ, సౌకర్యాల కల్పన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికలు అద్భుతంగా ఉన్నాయని కేంద్ర మంత్రివర్యులు ప్రశంసించారు. గతంలో సూరత్, వారణాసి, ప్రయాగ్ రాజ్ లలో నిర్వహించి మహాకుంభ్ లో చేసిన ఏర్పాట్లు, భక్తుల రద్దీ నియంత్రణ తరహా మోడల్ ను వచ్చే పుష్కరాల్లో అమలు చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సహకరించాలని కోరాం. జల్ జీవన్ మిషన్ కు కేంద్రం నుంచి మరింత సహకారం అందించాలని కోరామ"ని అన్నారు.

# మెట్రోపై రగడ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

### రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించన కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీజూన్ 16ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు.

తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదన్నారు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలని మండిపడ్డారు. 50 ఏళ్ల వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం అని కిషన్‌రెడ్డి వివరించారు.తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన మండిపడ్డారు. మెట్రో రైలు ప్రాజెక్ట్ ఆపాలని తానేందుకు చెబుతానంటూ ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. ఒక లక్షా 75 వేల కోట్ల రూపాయలతో రహదారులను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి మా బాధ్యత' అని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్న ఆయన.. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ ఏమీ అవసరం లేదన్నారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# జులై మూడో వారంలో తల్లికి వందనం..

**మొదటిపేజీ తరువాయి**

విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందించే 'తల్లికి వందనం' పథకాన్ని జులై మూడో వారంలో అమలు చేసేందుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటు, పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు.

ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల, ఉన్నత విద్యాశాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. 'తల్లికి వందనం' పథకం అమలుపై ప్రధానంగా చర్చించారు. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపుగా పూర్తయిందని, జులై మూడో వారంలో పథకాన్ని అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని లోకేశ్ స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు జూన్ 29న 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం, తల్లిదండ్రులను భాగస్వాములను చేసేందుకు జులై మూడో వారంలో 'మెగా పీటీఎం' నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపైనా చర్చించారు.

పాఠశాల విద్యపై సమీక్ష అనంతరం, ఉన్నత విద్యారంగంపై మంత్రి లోకేశ్ దృష్టి సారించారు. రాష్ట్రంలో నిర్వహించే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ వంటి 12 రకాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్)ల నిర్వహణలో ఎలాంటి జాప్యం జరగకూడదని గట్టిగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత గడువులోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జాతీయ స్థాయి పరీక్షలు, పొరుగు రాష్ట్రాల సెట్ల తేదీలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా షెడ్యూల్ ఖరారు చేయాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88 లక్షల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని, ముఖ్యంగా డిమాండ్ ఉన్న మెకానికల్, సివిల్ బ్రాంచ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి ప్రపంచస్థాయి విద్యాసంస్థలను తీసుకురావడం ద్వారా ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచాలని మంత్రి ఆకాంక్షించారు. థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు చూపుతున్న ఆసక్తిపై చర్చించారు. ముఖ్యంగా, జీఎంఆర్ మాన్సాస్ ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని లోకేష్ ఆదేశించారు.

ఇదే సమయంలో, రాష్ట్రంలో ఎన్‌సీసీ కార్యకలాపాలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక 'ఎన్‌సీసీ స్టేట్ డైరెక్టరేట్'ను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయంతో ఏపీ యువతకు సైనిక శిక్షణలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె. శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్యా కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# గూటుపల్లి భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు.

## ..రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 16:** రాష్ట్రంలో రెవెన్యూ సంబంధిత అంశాల పరిష్కారం, ప్రస్తుత సీజనల్ పరిస్థితుల నిర్వహణ, వ్యవసాయం మరియు అనుబంధ శాఖల సంసిద్ధతతో పాటు నీట్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీఎస్‌సీఎల్‌ఏ, వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఉన్నతాధికారులు, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్ఓ రాము నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గూటుపల్లి గ్రామానికి సంబంధించిన భూముల సమస్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. గూటుపల్లి గ్రామంలోని భూములన్నీ వెబ్‌ల్యాండ్



రికార్డుల్లో 'వక్ఫ్ బోర్డు భూములు' మరియు 'ఎండోమెంట్ భూములు'గా నమోదై ఉండటంతో గ్రామ ప్రజలు వివిధ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామం మొత్తం ఈ విధంగా నమోదుకావడం వల్ల భూ లావాదేవీలు, హక్కుల నిర్ధారణ తదితర అంశాల్లో సమస్యలు తలెత్తుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా సంబంధిత రికార్డులను పరిశీలించి, అవసరమైన సవరణలు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వివరించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గూటుపల్లి గ్రామ భూముల అంశాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ అంశాల పురోగతి, భూ సంబంధిత సమస్యల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్యశాఖల సంసిద్ధతను పరిశీలించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే నీట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసినఎంపీ బైరెడ్డి శబరి.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 16:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద రోగులకు కొండంత అండ అని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరులోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఎంపీ కార్యాలయంలో నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉన్న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు బాధితులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిద్తూరు మండలం చెరుకుచర్ల గ్రామం రామసుబ్బమ్మకు రూ. 1,95,858 లు, గోస్పాడు మండలం దీబగుంట్ల గ్రామం లక్ష్మి దేవికి రూ. 1.64,191లు, దొర్నిపాడు మండలం చాకరాజువేముల గ్రామం లింగమ్మ కు రూ. 2,32,171లు, పగిద్యాల మండలం, పాత ముచ్చుమర్రి గ్రామం అనురాధకు 3,01,617 లు, శిరివెళ్ల మండలం, యర్రగుంట్ల గ్రామం బి. కుమార్ కు రూ. 1,83,706 లు, కొత్తపల్లి మండలం, గువ్వలకుంట్ల గ్రామం నాగేశ్వరరెడ్డి కి రూ. 1,40,852 లు, గోస్పాడు మండలం, దీబగుంట్ల గ్రామం వెంకటేశ్వర్లు కు రూ. 50,524 లు, ఆళ్ళగడ్డ మండలం పాలసాగరం గ్రామం అల్లాభకాష్ కు రూ. 46,600 లు, పగిద్యాల మండలం పాత ముచ్చుమర్రి గ్రామం శ్రీనివాసులు కు రూ. 40,350 లు, మహానంది మండలం, మసీదుపురం గ్రామం మల్లికార్జున కు రూ. 1,16,756లు, ఉయ్యాలవాడ మండలం, హరివరం గ్రామం కాకర్ల జ్యోతి కి రూ. 1,05,953 లు, ఓర్వకల్ మండలం గుట్టపాడు గ్రామం శ్రీనివాసులు కు రూ. 1,19,558లు, కొలిమిగుండ్ల గ్రామం కు చెందిన శివ లక్ష్మమ్మ కు రూ. 1,01,850 లు, నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామం పద్మావతి కి రూ. 1,37,605 లు, పాములపాడు మండలం, మిట్టకంధాల గ్రామం కోటేశ్వరరెడ్డి కి రూ. 83,509 లు, నంద్యాల రామనాథ్ రెడ్డి నగర్ కు చెందిన గొల్ల ఉసెన్ కు రూ. 2,13,577 లు, ఉయ్యాలవాడ మండలం, హరివరం గ్రామం ఎం. పెద్ద చంద్రయ్య కు రూ. 1,05,953 లు, ఆత్మకూరు మండలం పిన్నాపురం గ్రామం ఎం. చిన్న తిమ్మారెడ్డి కి రూ 89,520 లు, బేతంచెర్ల వెంకట జితేంద్రరెడ్డి కి రూ. 30,000 లు, ఇలా మొత్తం 19 మందికి రూ. 24,60,151 లక్షలు, సీఎం సహాయనిధి ముందస్తు అనుమతి రూ. 6 లక్షలు, మొత్తం రూ. 30,60,151 లక్షల చెక్కులు బాధితులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న భాధితులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# శ్రీనివాస నగర్ ప్రధాన రహదారి వైట్‌టాప్ నిర్మాణంలో ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం.

**..ప్రమాదంలో మరణించిన ఇమాంసా కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి**

**..ప్రజా సమస్యలపై పౌర సమాజం స్పందించాలి.**

**-బొజ్జా దశరథరామిరెడ్డి**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 16:** శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్‌గా జీవనోపాధి పొందుతూ తన పేద కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇమాంసా మృతి చెందడం అత్యంత బాధాకరమైన సంఘటన అని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంగళవారం నంద్యాల సమితి కార్యాలయం నందు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ..

శ్రీనివాస నగర్ ప్రధాన రహదారిలో తారు రహదారి స్థానంలో వైట్‌టాప్ (సిమెంట్) రహదారి నిర్మాణ పనులు చేపట్టిన నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, నిర్మాణ ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు లేకపోవడం, అలాగే వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కలిసి ఈ ప్రమాదానికి కారణమైనట్లు స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

నంద్యాల పట్టణంలోని అత్యంత కీలకమైన ప్రధాన రహదారులలో ఒకటైన ఈ రోడ్డులో గత మూడున్నర నెలలుగా నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ, కనీసం ఒక వైపు రహదారిని కూడా ప్రజల రాకపోకలకు అందుబాటులో ఉంచలేకపోవడం విచారకరమన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, పాదచారుల భద్రత వంటి అంశాల్లో సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. ఆర్ & బి శాఖ, మున్సిపాలిటీ, ట్రాఫిక్ పోలీసులు మరియు ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ రహదారి పరిసర ప్రాంతాల్లో అనేక ఆసుపత్రులు, మెడికల్ షాపులు ఉండటంతో ప్రతిరోజూ రోగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నారని, నిర్మాణ పనులను క్రమబద్ధంగా మరియు వేగవంతంగా పూర్తి చేయడంలో విఫలమవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. పరిస్థితి తీవ్రతను గమనించినప్పటికీ సంబంధిత శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజా సమస్యలపై అప్రమత్తంగా స్పందించాల్సిన రాజకీయ పార్టీలు కూడా పరస్పర విమర్శలకే పరిమితమై, ప్రజా భద్రత వంటి కీలక అంశాలపై సమిష్టి బాధ్యతతో వ్యవహరించలేకపోతున్నాయని ఆయన విమర్శించారు. ఇలాంటి సందర్భాల్లో పౌర సమాజం, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక చైతన్యవంతులు కలిసి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసే వేదికలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల పట్టణ ప్రముఖులు ఈ దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఇమాంసా మరణానికి దారితీసిన పరిస్థితుల్లో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం కూడా ఒక కారణమని భావిస్తున్నందున, ఆయన కుటుంబానికి ప్రభుత్వం కనీసం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. "అభివృద్ధి పనులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ప్రజల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ శాఖల బాధ్యత. మృతుడి కుటుంబ సభ్యులకు మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు.

# హై డెన్సిటీ ప్లాంటేషన్‌తో పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

**..ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను మోడల్ గ్రీన్ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలి.**

**..జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 16:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టి పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో హై డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, డీఈఓ జనార్ధన్ రెడ్డి, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులు శర్వానన్ సుబ్రమణ్యం, జయసూర్య, ఆశ్రిత, అంకిత కుమారి, రాజశేఖర్, శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు మరియు వసతి గృహాల ప్రాంగణాల్లో హై డెన్సిటీ ప్లాంటేషన్ ద్వారా పర్యావరణహిత వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఒక పాఠశాలను ఎంపిక చేసి సోక్ పిట్స్, వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, సోలార్ సదుపాయాలు తదితర అంశాలను సమగ్రంగా ఏర్పాటు చేసి దానిని ఆదర్శ గ్రీన్ మోడల్ పాఠశాలగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాతినేలలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా హై డెన్సిటీ ప్లాంటేషన్ విజయవంతంగా అమలు చేయడానికి అనువైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, అందుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధులను కోరారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ప్రతినిధి శర్వానన్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, వర్షాకాలంలో లభించే నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడం అత్యంత అవసరమన్నారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, వర్షపు నీటి నిర్వహణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో అమలు చేయడం ద్వారా జిల్లాలో పచ్చదనం గణనీయంగా పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా రక్తదాన దినోత్సవం.

**-ప్రారంభించిన ఎస్బిఐ రీజనల్ మేనేజర్.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 16:** నంద్యాల పట్టణంలోని శ్రీనివాస సెంటర్లో ఉన్న స్టేట్ బ్యాంక్ అండ్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ ఆవరణలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం మరియు జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరాన్ని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నంద్యాల రీజియన్ రీజినల్ మేనేజర్ టి. రామ్మూర్తి రాజు, హెచ్‌ఆర్ మేనేజర్ జి. కేశవ గౌడ్, ఎస్బిఐ మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి రాఘవ యాదవ్, సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ దస్తగిరి పర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గసభ్యులు ఎస్. ఉస్మాన్ భాష, బ్లడ్ స్టోరేజ్ ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, సిబ్బంది కవిత, సరిత, కర్నూల్ రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్బిఐ నంద్యాల రీజియన్ రీజినల్ మేనేజర్ టి. రామ్మూర్తి రాజు మాట్లాడుతూ జూలై ఒకటిన ఎస్బిఐ దినోత్సవం, అలాగే ప్రపంచ రక్త దాన దినోత్సవం పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన కేంద్రాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు నంద్యాలలో ఎస్బిఐ సిబ్బంది ఈ రక్తదాన శిబిరంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్మాన్ భాషా మాట్లాడుతూ గత 2, 3 సంవత్సరాలుగా స్టేట్ బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్ సొసైటీ వారికి రక్తదాన శిబిరం ఏర్పాటుకు సహకరిస్తున్నారని, సొసైటీ తరఫున ఎస్బిఐ ఆర్ఎం గారికి, వారి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

# అమర్నాథ్ గౌడ్ త్యాగం మరువలేనిది: ఎన్ఎండీ ఫిరోజ్.



**ఆంధ్రప్రగతి నంద్యాల, జూన్ 16:** బాపట్ల జిల్లా ఉప్పలవారిపాలేనికి చెందిన 13 ఏళ్ల బాలుడు, ఉప్పాల అమర్నాథ్ గౌడ్ దారుణ హత్యకు గురై నేటితో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా, నంద్యాల తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నంద్యాల పార్టీ కార్యాలయం నుంచి పద్మావతి నగర్ ఆర్చి వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ... తన సోదరిని వేధించిన వైసీపీ నాయకులను ధైర్యంగా ఎదిరించి, ప్రాణాలర్పించిన అమర్నాథ్ గౌడ్ త్యాగం స్ఫూర్తిదాయకమని అన్నారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని, అప్పట్లో జరిగిన ప్రజా తీర్పు ద్వారా వైసీపీకి 11 సీట్లు ఇచ్చి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి సాదిస్తోందని, ప్రజల మద్దతు ఎప్పుడూ అభివృద్ధి చేసే కూటమి ప్రభుత్వానికే ఉంటుందని తెలిపారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, బాలుడి త్యాగాన్ని ఎప్పటికీ మరువబోమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లెల్ల శ్రీరాములు, రమణయ్య గౌడ్, గోవిందు నాయుడు, ఉప్పర సురేష్ కుమార్, రామచంద్రుడు, బుగ్గ రాముడు , మరాఠీ సూరి, పద్మ, నాగరత్నమ్మ, మధు సాయి, మంజుల సుబ్బరాయుడు, వడ్డే జనార్ధన్, మారుతి కుమార్ మరియు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించాలి.

**పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలి. -.జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 16:** జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ లో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమ నిర్వహణపై మున్సిపల్ కమిషనర్లు, డిపివో తదితరులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నగర కార్పొరేషన్, అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో జరుగుతున్న పనులకు సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా నిర్దేశించిన విధంగా పారిశుధ్య కార్యక్రమాలు జరగాలని ఆదేశించారు.. అన్ని మున్సిపాలిటీ ల్లో ఈ కార్యక్రమం ద్వారా ఏ విధంగా పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఈ వారం పబ్లిక్ టాయిలెట్స్, చెత్త కుప్పల తొలగింపు కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా తమ వద్దే వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. గ్రామాల్లో స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాలు గ్రామాన్ని ఎన్నిసార్లు సందర్శించి చెత్త సేకరిస్తున్నాయి, తడి చెత్త – పొడి చెత్త సేకరిస్తున్న విధానం, గ్రామాలలో రోడ్లు ఏ విధంగా శుభ్రపరుస్తున్నారు, ఎన్ని కిలోమీటర్లు శుభ్రపరుస్తున్నారు, రీసైక్లింగ్ ఏ విధంగా చేస్తున్నారన్న విషయాలను డిపిఓ భాస్కర్ ను అడిగి తెలుసుకున్నారు. వీధులు, ప్రధాన రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించి శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరగాలని కలెక్టర్ డిపివో ను ఆదేశించారు. వ్యర్థాల విభజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలు పారిశుధ్యం, పరిశుభ్రత లో మంచి పనితీరు కనపరిచి ప్రజలకు మంచి సేవలు అందించాలని, తద్వారా స్వచ్ఛ భారత్ మిషన్ ర్యాంక్ లు సాధించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, అడిషనల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రఘు, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సిపల్ కమిషనర్ లు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## జూన్ 19 వ తేదీ న నంద్యాల జిల్లా స్థాయి చెస్ పోటీలు.

**-శ్రీ రామకృష్ణ డిగ్రీ కాలేజ్ స్వామి వివేకానంద ఆడిటోరియంలో.**

**-రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జోన్ 16:**



ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహించబోయే రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక కోసం నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19 వ తేదీ , శు క్రవారం ఉదయం 9 గంటల నుండి శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల స్వామి వివేకానంద ఆడిటోరియం లో నంద్యాల జిల్లా స్థాయి అమెచ్యూర్ చెస్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నంద్యాల జిల్లా చెస్ అధ్యక్షులు, ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్. జి. రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు ఏపీ చెస్ వెబ్సైట్లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలని నంద్యాల జిల్లా ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి చదరంగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంట్రీలు నమోదు చేసుకోవడానికి,ఇతర వివరాలకు సంప్రదించవలసిన నెంబర్ 9010451585.

## స్వాతంత్ర్య సమరయోధులను అనుక్షణం స్మరించుకోవాలి

**..సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 16:**



డోన్ పట్టణం నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ చిత్తరంజన్ దాస్ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు. చిత్తరంజన్ దాస్ నవంబర్ 5-1874 బెంగాల్ లో జన్మించారు. ఈయన మన దేశ ప్రజలను చిత్రహింసలు పెడుతున్న బ్రిటిష్ వారి ఆగడాలను సహించక స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి బ్రిటిష్ దుస్తులను బహిష్కరించడమే కాకుండా స్వదేశీ ఖాదీని ధరించారు. ఖాదీ పై ప్రజల్లో అవగాహణ పెంచారు. ఈయన అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా మన దేశం కోసం చివరి వరకు పట్టుదలతో బ్రిటిష్ వారిపై పోరాడారు. ఆయన వారసత్వాన్ని ఆయన శిష్యులు అనుసరించారు. వారిలో సుభాష్ చంద్ర బోస్ ముఖ్యుడు. ఈయన జూన్ 16 1925 న స్వర్గస్తులైనారు. ఇలాంటి మహనీయులను ఎల్లవేళలా స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

## మహిళల గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు సహించం.

**గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలను ఖండిస్తూ నంద్యాలలో తెలుగు మహిళల భారీ నిరసన.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 16:**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ తెలుగు మహిళ విభాగం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ సర్కిల్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ నాయకులు గుడివాడ అమర్నాథ్ చిత్రపటానికి కోడిగుడ్లు, టమాటాలు విసురుతూ నిరసన వ్యక్తం చేశారు. మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు హుందాగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్ మాట్లాడుతూ, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని అన్నారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని రాష్ట్ర మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుండగా, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు చేయడం వైసీపీ నాయకుల మహిళా వ్యతిరేక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే రాజకీయ సంస్కృతిని ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని, మహిళల హక్కులు మరియు ఆత్మగౌరవ పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం పోరాడుతుందని ఎన్ఎండి ఫిరోజ్ గారు స్పష్టం చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు నసీరా, పద్మావతి, ఝాన్సీ, పావని, లక్ష్మి, భారతి రెడ్డి, సౌభాగ్యతో పాటు పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## నంద్యాలలో 'అమరావతి కేఫ్' ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 16:** నంద్యాల పట్టణంలో స్థానిక ఫైర్ ఆఫీస్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన 'అమరావతి కేఫ్' మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి కేఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన ఈ కేఫ్ నంద్యాల ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన రుచికరమైన టిఫిన్లు, భోజనం మరియు ఫాస్ట్‌ఫుడ్ అందుబాటులో ఉంచడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయకృష్ణ, హుస్సేన్ భాష, మున్నా, ప్రభాకర్, సునీల్, సుధాకర్, ప్రవీణ్ కుమార్, రఘునందన్, మంజుల సుబ్బరాయుడు, వడ్డే జనార్ధన్, ఉప్పరి సురేష్ కుమార్, గోవింద నాయుడు, మధు సాయి, బుగ్గ రాముడు, దీపక్ రెడ్డి, కృపాకర్, సుధాకర్, నబిరసూల్, ఇంతియాజ్ చాంద్ భాషా, నాగరత్నమ్మ, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కులవృత్తులకు 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' భరోసా..!

**లబ్ధిదారులకు ఆధునిక యంత్రాలు అందజేసిన జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు.**

**..బీరవోలులో ఘనంగా పంపిణీ కార్యక్రమం.. కేంద్ర ప్రభుత్వ పథకాలనుఅందిపుచ్చుకోవాలని పిలుపు.**











**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూన్ 16:**

సాంప్రదాయ కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ఆర్థిక చేయూతనిచ్చి, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' పథకాన్ని తీసుకువచ్చిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. బనగానపల్లె మండల పరిధిలోని బీరవోలు గ్రామంలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు ఉచిత ఆధునిక యంత్రాలు (టూల్ కిట్స్) పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అభిరుచి మధు లబ్ధిదారులకు చేతులమీదుగా యంత్రాలను అందజేశారు.

**శ్రమకు ఆధునికత తోడైతేనే ప్రగతి..**

ఈ సందర్భంగా అభిరుచి మధు మాట్లాడుతూ.. శతాబ్దాలుగా సమాజ శ్రేయస్సులో కీలక పాత్ర పోషిస్తున్న విశ్వకర్మల (వివిధ కులవృత్తుల వారి) శ్రమను గుర్తించిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి చెప్పి, ఆధునిక యంత్రాల ద్వారా తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం పొందేందుకు ఈ పథకం దోహదపడుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, ద్రవ్య సహాయం మరియు తక్కువ వడ్డీతో కూడిన రుణ సదుపాయాలను నియోజకవర్గంలోని ప్రతి ఒక్క అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఆర్థిక స్వావలంబనే లక్ష్యం..**

"గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కులవృత్తులే వెన్నెముక. లబ్ధిదారులు ఈ ఆధునిక యంత్రాల ద్వారా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని, ఆర్థికంగా స్థిరపడాలని బీరవోలు గ్రామంలోనే కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అర్హులందరికీ ఈ పథకం వర్తించేలా తమ వంతు కృషి చేస్తామని అభిరుచి మధు తెలిపారు.

**లబ్ధిదారుల ఆనందం..**

కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ఆధునిక పరికరాలను అందుకున్న బీరవోలు గ్రామ లబ్ధిదారులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. గతంలో చేతులతో పనులు చేసుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లమని, ఇప్పుడు ఈ యంత్రాల ద్వారా నాణ్యమైన ఉత్పత్తులను వేగంగా తయారు చేసుకునే అవకాశం కలిగిందని కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బనగానపల్లె బీజేపీ నాయకులు శివకృష్ణ, బీవీ సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు హరికృష్ణ, యాదగిరి, సీతమ్మ, బాలముని, శ్రీరాములు మరియు బీరవోలు గ్రామ ప్రజలు, కూటమి శ్రేణులు, పీఎం విశ్వకర్మ పథకం లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సంక్షేమ పాఠశాలలు , వసతి గృహాలు పచ్చదనంతో కళకళ లాడాలి.

**..సంక్షేమ పాఠశాలలు , వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం చేయండి.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు , జూన్ 16:**

జిల్లాలోని సంక్షేమ పాఠశాలలు మరియు వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం గా సాధించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో సంక్షేమ పాఠశాలలు , మున్సిపాలిటీ , డ్వామా , రూరల్ వాటర్ సప్లై , డీపీవో , నెట్ జీరో మొదలగు అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సమావేశం నిర్వహించి సంక్షేమ పాఠశాలలు , వసతి గృహాలను నెట్ జీరో హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడానికి పనులు వేగవంతం చేయడానికి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.... సంక్షేమ పాఠశాలలు వసతి గృహాలను హెల్తీ క్యాంపస్ లుగా తీర్చిదిద్దడం లో భాగంగా అల్ట్రా హైడెన్సిటీ మొక్కలు నాటడానికి గుర్తించిన 10 స్కూళ్లలో వెంటనే పనులు ప్రారంభించి పూర్తిస్థాయిలో మొక్కలు నాటే చర్యలు తీసుకోవాలని , అలాగే రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు ఎక్కువమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వెంటనే 10 రోజు ల లో ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన కార్యాచరణ వెంటనే పూర్తి చేయాలని డ్వామా పిడి నరసింహారెడ్డిని ఆదేశించారు.

సంక్షేమ వసతి గృహాల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... పాఠశాలలు , వసతి గృహాలు పచ్చదనంతో కళకళలాడాలని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉండాలని అప్పుడే విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం లభిస్తుందని వారు చదువుపై శ్రద్ధ పెట్టగలరని అటువంటి వాతావరణం విద్యార్థులకు అందించే చర్యలు కోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని వాటర్ హార్వెస్టింగ్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లు , కిచెన్ గార్డెన్ మొదలగునవి ఏర్పాటు చేయటానికి అనుకూలమైన ప్రదేశాలు చూపించి పనులు చేయటానికి సంబంధిత అధికారులతో సహకరించి పనులు పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పిట్ ల వలన ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త లు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లా లోని అన్ని సంక్షేమ పాఠశాలలు , సంక్షేమ వసతి గృహాలలో ఉన్న స్థలం మేరకు తప్పక మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కర్నూలు జిల్లా నేలకు మరియు వాతావరణము కి అనుకూలమైన మొక్కలు తెప్పించి త్వరగా నాటే కార్యక్రమాలు జరిపించాలని నెట్ జీరో కోఆర్డినేటర్లకు సూచించారు.

ఈ సమావేశానికి డ్వామా పీడీ నర్సింహారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక , ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు , అడిషనల్ కమిషనర్ కృష్ణ , డిపిఓ భాస్కర్ , పబ్లిక్ హెల్త్ ఇంజనీర్, మహాత్మ జ్యోతిబాపూలే మరియు అంబేద్కర్ గురుకుల వసతి గృహాల కోఆర్డినేటర్లు , నెట్ జీరో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కళ్యాణ్ మరియు సంబందించిన సిబ్బంది పాల్గొన్నారు.

## కర్నూలులో అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు.

**..5.50 లక్షల మందితో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడమే లక్ష్యం. -..సెట్కూరు సీఈవో వేణుగోపాల్.**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 16:**

కర్నూలు జిల్లాలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని 5.50 లక్షల మందితో యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడమే లక్ష్యంమని సెట్కూరు సీఈవో వేణుగోపాల్ పేర్కొన్నారు.

మంగళవారం కర్నూలు నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద ఉన్న శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సెట్కూర్ సీఈవో వేణుగోపాల్ మాట్లాడుతూ... జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 5 లక్షల 50 వేల మందితో యోగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ పూర్తయిందని ఆయన వెల్లడించారు. ఈ భారీ కార్యక్రమం కోసం 11,500 మంది మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణ అందించామని, వారు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు యోగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. పర్యాటక యోగా కార్యక్రమాల్లో భాగంగా కర్నూలు నగరంలోని రాక్ గార్డెన్, కొండారెడ్డి బురుజు వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సుమారు 800 మందితో యోగా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. అలాగే దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ దేవాలయాలైన ఊరుకుంద క్షేత్రం, మంత్రాలయం, పెరవల్లి, కల్వబుగ్గతో పాటు జగన్నాథగట్టు వంటి పుణ్యక్షేత్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి కృషి చేస్తున్న దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 18న ఎస్‌సీపీ గ్రౌండ్‌లో దాదాపు వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అంకితభావంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. యోగాపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించేందుకు గ్రామ, పంచాయతీ, వార్డు, మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించామని, జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. శివుని సాక్షిగా జగన్నాథగట్టు వంటి ఆధ్యాత్మిక, ప్రశాంత వాతావరణంలో యోగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ ?

**జూన్ 16ఆంధ్ర ప్రభ**

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవలంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్ధతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్ధతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే



రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభా నికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూర్‌పలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.

## యుద్ధమేఘాలు తొలగడంతో ధరలకు మళ్లీ రెక్కలు

### క్రమంగా పెరుగుతున్న బంగారం ధరలు

**న్యూఢిల్లీ, జూన్ 16ఆంధ్ర ప్రభ :** అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో బంగారానికి మళ్లీ డిమాండ్ పెరుగుతోంది. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడంతో ద్రవ్యోల్బణం భయాలు తొలగిపోయాయి. దీంతో, వడ్డీ రేట్లను అమెరికా ఫెడరల్ రిజర్వ్ పెంచే అవకాశాలు తక్కువని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. తమ పెట్టుబడులను యూఎస్ ట్రెజరీ బాండ్‌ల నుంచి మరింత లాభదాయకమైన బంగారం వైపు మళ్లిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా బంగారం ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయని అంటున్నారు. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,540గా ఉంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ. 1,38,910ల వద్ద కొనసాగుతోంది. ఏపీ, తెలంగాణలోని ప్రధాన ప్రాంతాల్లో ధరలు దాదాపుగా ఇదే స్థాయిలో ఉన్నాయి. నిన్న దేశంలో మేలిమి బంగారం ధర ఏకంగా రూ. 2,450ల మేర పెరిగిన విషయం తెలిసిందే.

## దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహుకరణ

### ఇంద్రకీలాద్రిపై రూ.82 కోట్లతో విస్తరణ పనులు



**విజయవాడ, జూన్ 16ఆంధ్ర ప్రభ**

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు.. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను బహూకరించారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు మంగళవారం ఉదయం పట్టుచీరను అందజేశారు. ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ చీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని విజయ్‌కుమార్ తెలిపారు. దీని తయారీకి వారం రోజులు పట్టిందని చెప్పారు. ఇదిలావుంటే విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.భక్తుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుంది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ. 82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. జులై చివరి నాటికి ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

----------

## హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

### దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు

### ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం

### అమరన్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటి సిఎం

**అమరావతి, జూన్ 16ఆంధ్ర ప్రభ** రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టూబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## యోగా మన జీవితంలో భాగం కావాలి

### కృష్ణా తీరంలో పెద్ద ఎత్తున యోగాంధ్ర -21న యోగా దినోత్సవ విజయం చేయాలన్న కలెక్టర్

**విజయవాడ,జూన్ 16ఆంధ్ర ప్రభ**

రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అంతా కలిసి యోగాసనాలు వేస్తున్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశ ఆధ్వర్యంలో బరమ్ పార్కులోని కృష్ణా నదీ తీరాన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' కోసం అందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే, మనం చేసే పనిలో అంతటి అంకితభావం ఉంటుందని తెలిపారు. వికసిత్ భారత్, విజన్ ఆంధ్రప్రదేశ్ 2047 వంటి లక్ష్యాలను సాధించాలంటే పౌరులందరూ ఆరోగ్యంగా ఉండటం అవసరమన్నారు. ఈ యోగాసనాలు సరళంగా ఉండి ప్రతి ఒక్కరూ సులభంగా ప్రాక్టీస్ చేసేలా ఉంటాయని కలెక్టర్ వెల్లడించారు. రోజుకు 45 నిమిషాల పాటు సమయం కేటాయిస్తే సరిపోతుందని తెలిపారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం



సందర్భంగా విజయవాడ వీఎంసీ స్టేడియం, అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం ఉంటుందని.. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని

తెలిపారు. ప్రజలందరూ ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ లక్ష్మీ శ పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు మొవ్వ మండలం కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, అధికార ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కూచిపూడి కళాకారులు, విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే సామూహిక యోగాసనాలు వేశారు. విద్యార్థుల యోగా విన్యాసాలు అందిరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. ప్రజలందరూ యోగాపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని... అప్పుడే అనేక వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. యోగా సాధన ద్వారా కలిగే ప్రయోజనాలు అనేకమని, మానసిక చైతన్యం పెరుగుతుందని చెప్పారు. ముఖ్యంగా బాల్య దశ నుంచే యోగా అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కూచిపూడిలో యోగాంధ్ర వేడుకలు జరగడం సంతోషకరమని ఎమ్మెల్యే కుమార్ రాజా తెలిపారు. 76 ఏళ్ల వయసులో సీఎం చంద్రబాబు ఇంత చురుగ్గా ఉండడానికి కారణం... ఆయన దశాబ్దాలుగా యోగా సాధన చేయడమే అని చెప్పుకొచ్చారు. ప్రకృతి మనకు అందించిన గొప్ప వరం యోగా అని అన్నారు. యోగా చేద్దాం.... ఆరోగ్యంగా జీవిద్దాం అన్నది అందరి నినాదం కావాలని ఎమ్మెల్యే కుమార్ రాజా పేర్కొన్నారు.

## జూన్ 17న టెక్కే మార్కెట్ యార్డులో ఘనంగా

## "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం.





**ఆంధ్ర ప్రభ నంద్యాల, జూన్ 16:**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమానికి సంబంధించి మంగళవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డులో ఏర్పాట్లను మంత్రి, కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రధాన వేదిక, ఎగ్జిబిషన్ స్టాళ్లు, పార్కింగ్ ప్రదేశాలు, పందిళ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సదుపాయాలు తదితర ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ కార్యక్రమం నిలవనున్నందున అన్ని ఏర్పాట్లు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సూచించారు. కార్యక్రమానికి సుమారు ఐదు వేల మంది ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న శాఖల స్టాళ్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రభావాన్ని, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను స్పష్టంగా ప్రతిబింబించేలా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. మొత్తం 19 శాఖలు తమ తమ విభాగాల సేవలు, విజయాలు, వినూత్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, వ్యవసాయ, మెప్మా, పశుసంవర్ధక, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్, పర్యాటక, ఆర్‌డబ్ల్యూఎస్, శానిటేషన్, పోలీసు, మత్స్యశాఖలతో పాటు ఇతర విభాగాలు కూడా తమ శాఖల పనితీరును ప్రజలకు చేరవేసేలా ఆకర్షణీయమైన స్టాళ్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

అంతకుముందు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.